# కన్నప్రేమ

## వాయుసుత

"అదేమిటే అమ్మాయ్, అల్లుడికి సెలవు ఎన్నాళ్ళా అంటే మాట్లాడవేమే?" కామాక్షమ్మ కాయగూరలు తరుగుతూ అన్నది.

వంటింటి గడపలో పీటమీద కూర్చుని కాఫీ తాగుతూన్న శ్రీలక్ష్మి, "ఏంచెప్పమంటావమ్మా? నాకు ఆయనతో వచ్చిన చిక్కు ఒకటి కాకుండా ఉంది" అన్నది నెమ్మదిగా.

"ఏం జరిగిందే? వచ్చినప్పటినుండీ చూస్తున్నాను. అదోలా ఉంటే, నెలలు నిండుతున్నాయి కదా కాస్త నలతగా ఉన్నావేమోననుకున్నాను. అయినా ఈ సమయంలో నువ్వు మనసులో ఏదో పెట్టుకుని బాధ పడకూడదు. ఏమైందీ చెప్పవే" అన్నది కామాక్షమ్మ ఆత్రంగా.

"ఏంలేదమ్మా, వారు ఇక ఉద్యోగం చెయ్యరట. వాళ్ళ ఊళ్ళో ఏదో వ్యాపారం చేస్తారట. ప్రస్తుతానికి మూడు నెలలు సెలవుపెట్టి వచ్చారనుకో. వ్యాపారం మొదలైన తరవాత ఉద్యోగానికి రాజీనామా ఇస్తారట."

"దానికి నువ్వింత బాధపడటం దేనికి? పని మానేసి ఊరికే కూర్చుంటాననటంలేదుగా. స్వతంత్రంగా వ్యాపారం చేసుకుంటే అందులోనూ పైకి రావచ్చు. అబ్బాయి అన్నీ ఆలోచించకుండానే చేస్తాడంటావా?" అని కామాక్షమ్మ మళ్ళీ తన పనిలో నిమగ్నురాలయింది.

"ఇంకా విను. మరీ . . . పెట్టుబడికి డబ్బు కావాలిట. నాన్న నడిగి ఓ పది వేలు సర్దుబాటయేలా చూడమంటున్నారు" అన్నది శ్రీలక్ష్మి తల్లి ముఖంలోకే చూస్తూ.

శ్రీలక్ష్మి అనుకున్నట్టుగానే కామాక్షమ్మ ముఖంలో రంగులు మారాయి. చేతిలో పని ఆపేసింది.

"ఇది మరీ బావుందేవ్! అల్లుడు వ్యాపారం చేయడానికి మామగారు పెట్టుబడి పెట్టాలా! నేనింకా అతని చేతిలో ఏదో నాలుగు రాళ్ళు కూడాయేమో, అందుకని వ్యాపారం మొదలు పెడతానంటున్నాడేమోనని అనుకుంటున్నాను."

"ఈ ఉద్యోగాలుచేసి ఇంకా కూడబెట్టడంకూడానా, అమ్మా. . . నాన్న సర్దకపోతే తన వాటాకు వచ్చే ఆస్తి అమ్మేస్తానంటున్నారు" అన్నది శ్రీలక్ష్మి.

"అమ్ముకోమనవే, ఎవర్ని బెదిరిస్తాడంటా! సోయి సంతకాలం మీ అవసరాలేచూస్తూ కూర్చుంటే ఇక మాకుమాత్రం వెనక మిగతా పిల్లలు లేరూ? ఆ కార్యాలన్నీ ఎలా గట్టెక్కాలి . . ."

భార్యమాటలు గట్టిగా వినిపిస్తుంటే, వరండాలో పేపరు చదువుకుంటూ కూర్చున్న రమణయ్య లోపికి వచ్చాడు.

ఆయన్ని చూస్తూనే, "ఇది విన్నారా! మీ అల్లుడిగారికి పది వేలు కావాలిట" అన్నది కామాక్షమ్మ కోపంగా.

రమణయ్యకు ఏమీ అర్థంకాలేదు.

"అమ్మాయ్, లక్ష్మీ! ఇలా వచ్చి అసలు సంగతేమిటో చెప్పమ్మా" అన్నాడు తను హాల్లోకి వెళుతూ.

కూతురితోపాటు తనూ లేచివచ్చింది కామాక్షమ్మ.

"నేను చెబుతుంటే అర్థంకావటం లేదా ఏం? మీ అల్లుడు వ్యాపారం చేస్తాడట — మీరు పెట్టుబడి పెడితే. అదేం కుదరదని చెప్పేయండి. ఈ మూడేళ్ళూ అతను ఆడింది ఆటా, పాడింది పాటగా జరిపిస్తూనే ఉన్నాం. ఇంకా అతగాడికి తృప్తి లేదు. మీకు మీ పెద్దమ్మాయిమీద ఎంత ప్రేమ ఉన్నప్పటికీ, మిగతా పిల్లల సంగతికూడా కాస్త ఆలోచించండి" అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది కామాక్షమ్మ.

రమణయ్య అన్ని సంగతులు శ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నాడు. కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. ఎంత ఆలోచించినా ఇది చిక్కు సమస్యగానే మిగిలింది.

ఎదురుగా శ్రీలక్ష్మి నిండుగా, కనుల పండువుగా కనిపించింది. కొద్ది రోజుల్లో మనవడిని ఎత్తుకో వచ్చని ఎంతో సంబరంగా ఉన్న ఆయనకు ఇప్పుడీ కొత్త సమస్య మనసును కాస్త కలవరపరిచింది.

"అల్లుడు ఉద్యోగం మానేయడం నాకేం నచ్చలేదమ్మా, లక్ష్మీ! మీ అమ్మ అంటున్నట్లు. . . ఇప్పుడంత డబ్బు సర్దడం కూడా నాకు వీలుపడదమ్మా. నీకు తెలియనిదేముంది? అన్నయ్యల కాలేజీ చదువులకు బోలెడు ఖర్చు అవుతూనే ఉంది. ఇంక చెల్లెళ్ళిద్దరిలో ఒకరికైనా ఈ ఏడు పెళ్ళిచేయాలనుకుంటున్నాం."

"నాకు తెలుసునాన్నా, ఈ సంగతులన్నీ. కానీ ఆయనే అర్థంచేసుకోలేకుండా ఉన్నారు. నేనెంత చెప్పినా వినలేదు. మిమ్మల్ని అడిగేదాకా నా ప్రాణాలు తీస్తున్నారు" అన్నది శ్రీలక్ష్మి నేలచూపులుచూస్తూ.

"అంతగా అయితే ఆ డబ్బు మళ్ళీ అప్పుగా తీర్చేస్తారట. . ."

రమణయ్య మెల్లిగా నవ్వాడు. "బావుందమ్మా. అతనికి అప్పివ్వటం, అది మళ్ళీ నాకు రావడంకూడానా!

---

పంతాలు పట్టింపులు మామ అల్లుళ్ళమధ్య సహజం. అవి లేకపోతే మజాలేదు. పిల్లను ఇచ్చినప్పుడు అల్లుడైనా, రోజులు గడిచిన కొద్దీ మామగారికి అల్లుడూ స్వంత బిడ్డలతో సమానం. వాని బాగుకోసం ఆవేదన చెందుతాడు. కన్న బిడ్డమీద ప్రేమ, మమకారం ఎలాటివో తెలిసినప్పుడు, లేదా అనుభవంలోకి వచ్చినప్పుడు, మామ అల్లుళ్ళమధ్య అంతరాలు అంతర్ధానమై, ఆత్మీయతలే మిగులుతాయి.

---

అతని తత్త్వం, అంతర్యం నేనింకా అర్థం చేసుకోలేదనుకుంటున్నాడు కాబోలు. బాగా ఖర్చు మనిషి. పైగా దేనికి ఖర్చుపెడుతున్నాడో కూడా ఎవరికీ అంతుపట్టనివ్వడు. నీ పెళ్ళికి అంతకట్నం ఇచ్చాము, అదంతా ఏమయింది? అడిగే అవసరం నాకు లేదనుకో, కానీ నీకైనా తెలుసునా అని?"

"నా కెలా తెలుస్తుంది నాన్నా? ఆ ఇంటిపేరే పెట్టుకుని ఉంటారు" అన్నది శ్రీలక్ష్మి.

"ఇంటికి ఖర్చుపెట్టినా అది ఉమ్మడి ఆస్తికదా. సరేలే, ఇప్పుడవన్నీ ఎందుకుగానీ, నేను మెల్లిగా అబ్బాయికి చెబుతాలే. నువ్వీ విషయాలన్నీ ఆలోచిస్తూ కూర్చోకు" అంటూ బయటకు వెళ్ళిపోయాడు రమణయ్య.

శ్రీలక్ష్మి తన గదిలోకి వెళ్ళి, బద్ధకంగా ఉంటే నిద్రపోయింది. కేశవరావు వచ్చి లేపేవరకూ అలాగే నిద్రపోయింది.

"అడిగావా, మీ నాన్నను! ఏమన్నారు?" అన్నాడు కేశవరావు శ్రీలక్ష్మి పక్కనే కూర్చుంటూ.

శ్రీలక్ష్మి మనసులో చాలా బాధపడింది. 'ఈ మధ్య ఈయనకు డబ్బు విషయాలు తప్ప మరే ఆలోచన రావటం లేదు!' అనుకుంది.

"నాన్న మీతో మాట్లాడతానన్నారే! . . ." అన్నది ముక్తసరిగా.

"అది సరేనోయ్, నీతో ఏమన్నారో చెప్పమంటూంటే..." కేశవరావు విసుగ్గా అడిగాడు.

"నాతోనా! చెప్పమంటారా? నువ్విప్పుడు ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చోడానికి వీల్లేదు. హాయిగా, పుట్టబోయే బాబుకు ఏం పేరు పెట్టాలో, వాడికేం బట్టలు కుట్టాలో అని ఆలోచించుకో అన్నారు..." అంటూ చెప్పుకుపోతున్న భార్యమాటల్లో 'నాకంటే వాళ్ళే నయం' అన్న ధోరణి స్పష్టంగా వినిపించిందేమో, కేశవరావు అంతటితో ప్రసంగం మార్చాడు.

ఆ సాయంత్రం షావుగా, అల్లుళ్ళ షికారుగా బయటకు వెళుతూంటే చూస్తూ వరండాలో నిలబడ్డ శ్రీలక్ష్మి గుండెలు దడదడా కొట్టుకున్నాయి.

'ఛ! ఇప్పుడేమయిందని నేనింత భయపడాలి. నాన్న ఎలాగో ఓలా వారికి సర్దిచెబుతారు' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంది.

కానీ . . . ఓ గంటలోపలనే, కంగారుగా తిరిగి వచ్చిన కేశవరావుని చూస్తూనే ఆమె ధైర్యమంతా జారిపోయింది.

"బట్టలు సర్దు... వెళ్ళిపోదాం" అన్నాడు కేశవరావు గదిలోకి వస్తూనే.

"ఏమైందండీ . . ." తెల్లబోయింది శ్రీలక్ష్మి.

"నువ్వు చెప్పకపోతే అప్పుడే అనుమానించాలే. నాకు డబ్బు ఇవ్వటం ఇష్టంలేక వేరే వంకలు ఎన్ని ఏనా చెబుతారు. ప్రస్తుతం చేతిలో ఏంలేదు, ఏంలేదు అని ఒకటే పాట. మరి కొత్తగా భూములు కొనడానికీ, పెళ్ళిళ్ళకీ ఎక్కడనుండీ వస్తున్నదో! పోనీ అప్పుగా ఇవ్వమన్నాను. దానికీ, 'అల్లుడికి అప్పుపెట్టానన్న అప్రతిష్ఠ నా కెందుకు? మీకు ఇవ్వవలసిన వాళ్ళమేగాని తిరిగి తీసుకునే ఆచారం లేదు మనలో' అని తప్పుకున్నారు. అల్లుడన్న గౌరవం, మోజు అప్పుడే తీరిపోయినట్లున్నాయి మీవాళ్ళకు. . ." కేశవరావు కోపంతో బుసలు కొడుతున్నాడు.

శ్రీలక్ష్మికి కోపంతోపాటూ ఏడ్పూ వచ్చింది.



"భలేవారండీ, మూడేళ్లు నిండిపోయినా ఇంకా కొత్తల్లుడనే అనుకుంటున్నారా? అయినా వాళ్లు మాత్రం మనకేమి తక్కువ చేశారు? మీరు కోరినంతా కట్నం పెళ్లికి ముందే మీ చేతికిచ్చారు. నలుగురూ మెచ్చుకునేట్లుగా పెళ్లిచేశారు. మీరు అడుగక పోయినా నాకు ఒంటినిండా నగలు పెట్టారు. ఇంత మన అలకలూ, సరదాలూ ఎప్పటికప్పుడు ఏ ఆలస్యం లేకుండా తీరుతూనే ఉన్నాయి."

శ్రీలక్ష్మి అంటూన్న మాటలకి కేశవరావు కోపం మరీ ఎక్కువయింది.

"నువ్వేమీ వాళ్లవైపు వకాల్తా పుచ్చుకుని మాట్లాడ నవసరంలేదు. బయలుదేరతావా? లేదా? — ఆసంగతి చెప్పు." అన్నాడు.

శ్రీలక్ష్మి ధైర్యం తెచ్చుకుని మెల్లిగా అన్నది. "మీరంతగా పట్టుపడితే రావడానికి నా కభ్యంతరం లేదు. కానీ తీరా వచ్చిన తరవాత, 'వాడు రమ్మంటే మాత్రం నువ్వెలా వచ్చావే? మొదటి కాన్పు పుట్టింట్లోనే జరగాలని నీకు తెలియదా, మీవాళ్లకు తెలియదా?' అని అత్తయ్య అంటే దానికి మరి . . . పూచీ మీరే. ."

కేశవరావు కాస్త ఆలోచనలో పడ్డాడు. ఆ మాటా నిజమే. అసలిప్పుడు అమ్మను కాస్త మంచి చేసుకుని, ఆవిడదగ్గిరనుండైనా పెట్టుబడికి డబ్బు తీసుకోవాలి. తను ఇప్పుడిలా కోపంలో లక్ష్మిని తీసుకువెళితే అప్రతిష్ఠ అనీ, పైగా లేనిపోని ఖర్చనీ ఆవిడకు కోపం రావచ్చు.

పైకిమాత్రం గంభీరంగా, కోపంగా అన్నాడు.

"ఔనులే, నీకుమాత్రం వంకలు తక్కువా! నేనింక ఇక్కడ ఒక్క క్షణంకూడా ఉండను" అంటూనే తన బట్టలన్నీ సూట్‌కేసులో సర్దుకుని బయలుదేరి వెళ్లిపోయాడు.

శ్రీలక్ష్మి అతనికి ఇప్పుడేం చెప్పినా లాభంలేదని ఊరుకుంది.

బాగా పొద్దుపోయి ఇంటికి వచ్చిన రమణయ్య, అల్లుడు ఊరెళ్లిపోయాడని తెలుసుకుని ఆశ్చర్య పోయాడు. తన మాటలకు అతనికి బాగా కోపం వచ్చిం దని తెలుసుకున్నాడు కాని, ఇలా అర్ధాంతరంగా వెళ్లి పోతాడని అనుకోలేదు. కనీసం వారం పది రోజుల్లో శ్రీలక్ష్మికి పురుడు వస్తుందని అనుకుంటున్నారు. అప్పటివరకూ ఏ గొడవా ఉండదని అనుకున్నాడు.







"సరే కానీయ్. ఏంచేస్తాం" అని విట్టార్చాడు.

రోజులు మామూలుగానే గడిచిపోతున్నాయి.

శ్రీలక్ష్మి లక్షణంగా ప్రసవించి ఆడపిల్లను కన్నది. వెంటనే రమణయ్య అల్లుడికి టెలిగ్రాం పంపాడు. అది చూచుకుని కేశవరావు వెంటనే బయలుదేరి వస్తాడని అంతా ఎదురుచూచారు. కాని అతను రాలేదు.

మూడో నాటికి శ్రీలక్ష్మి పేరిట కవరు వచ్చింది. తను రావడానికి వీలుపడదనీ, శ్రీలక్ష్మిని నెలలోపలే వచ్చేయవలసిందనీ కేశవరావు రాశాడు. అంతకుమించి మిగతా విషయాలేమీ లేవు.

అతని కోపం సంగతి బాగా తెలిసిందే అయినా, అతను రానందుకు శ్రీలక్ష్మి చాలా బాధపడింది. అల్లుడి మూర్ఖత్వానికి కామాక్షమ్మ ఇరుగూపొరుగూ దగ్గర కళ్లమ్మట నీళ్లు పెట్టుకుంది.

రమణయ్యకు అల్లుడి తత్వం మరికాస్త అర్థమయింది.

వెంట వెంటనే రెండు ఉత్తరాలు రావడంతో శ్రీలక్ష్మి అత్తవారింటికి బయలుదేరక తప్పలేదు. కామాక్షమ్మ, రమణయ్యకూడా వెళ్లారు దింపి రావడానికి.

కేశవరావు అత్తగారినీ, మామగారినీ పలకరించనైనా లేదు. పైగా ఇంట్లో మిగతా వాళ్లందరి మీదా అనవసరంగా విసుక్కుంటున్నాడు.

రెండు రోజులు ఓపికతోనే ఉన్నాడు రమణయ్య. కామాక్షమ్మకు వియ్యాలవారింట్లో ఇంకా ఎక్కువ రోజులుండటం బొత్తిగా ఇష్టంలేదు. ఆ మాటే భర్తతో చెప్పింది.

"అతను ఏదో పంతం పట్టాడని మీరూ అలా ఊరుకుంటే ఎలాగండీ? అతనితో మాట్లాడి రాత్రికి వెళ్లిపోతామని చెప్పండి" అన్నది.

కామాక్షమ్మకు అక్కడ ఉండటం ముళ్లమీద నిలుచున్నట్లుగా ఉంది. ఆవిడ పుట్టింది పల్లెటూరిలోనే అయినా, చిన్నతనంనుండీ బస్తీలోనే పెరిగింది. వివాహమైన తరవాత బస్తీ కాపరమే. పట్టణాలలో ఉండే సౌకర్యాలు, ఈ పల్లెల్లో ఎంత డబ్బున్నవాళ్లకైనా ఉండవనే ఆవిడ ఉద్దేశ్యం. క్రిందటి రోజు శ్రీలక్ష్మితో ఏవో మాటల సందర్భంలో, "ఈ పల్లెటూరిలో ఎలా కాపరం చేస్తావే, తల్లీ" అని నొచ్చుకుంటూ అంది.

శ్రీలక్ష్మి నవ్వింది. "ఏం ఫరవాలేదమ్మా. ఇక్కడా అలవాటైతే బాగానే ఉంటుంది. పొలాలూ, తోటలూ, అవీ ఎంతో అందంగా ఉంటాయట. మనం సినిమాల్లో చూడలా. మనుషులుకూడా చాలా అమాయకంగా కనిపిస్తున్నారు" అన్నది శ్రీలక్ష్మి. ఇరుగూ పొరుగూ వచ్చి ఎంతో ఆప్యాయంగా అన్ని విషయాలూ మాట్లాడటం ఆమెకు ఎంతో నచ్చింది. పట్నాలలో అయితే ఇంత కలివిడిగా ఉండరు.

"పైకి అమాయకుల్లా కనిపించినా వీళ్లల్లోనే గుండెలుతీసే బంటులుంటారు. అందరి విషయాలూ వీళ్లకే కావాలి. జాగ్రత్తగా ఉండాలి. పొలాలూ, తోటల సంగతంటావా, ఇంకా నయం — మీ ఆయన వ్యాపారం కాకుండా, వ్యవసాయం చేస్తానన్నలేదు. ఇప్పుడు చాలామంది అలాగే చేస్తున్నారటగా! అప్పుడు నువ్వూ, మీ ఆయనా ఏంచక్కా సినిమాల్లోలా పాటలు పాడుకుంటూ పొలంపనులు చేసుకునేవాళ్లు . . ."

అల్లుడు కోపంగా అంటున్నా, శ్రీలక్ష్మి పెద్దగా నవ్వేసి, ఆ మాటలను ఎగతాళిగా కొట్టిపారేసింది.

పగలంతా కేశవరావు ఇంట్లోనే ఉండడు. రమణయ్యకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వటం ఇష్టంలేక బయటనే తిరుగుతున్నాడు.

ఆ రాత్రికే వెళ్ళిపోదామని రమణయ్య కూడా నిశ్చయించుకున్నాడు.

"మేము రాత్రికి వెళ్ళిపోతామమ్మా, అబ్బాయి కోపం ఇంకా తగ్గినట్లులేదు" అన్నాడు రమణయ్య, కేశవరావు తల్లి కాంతమ్మ నుద్దేశించి.

"ఏదోలెండి, అన్నయ్యా! చిన్నతనం. అవసరానికి అడిగినప్పుడు లేదన్నారని వాడికోపం. మీరు కాస్తయినా సర్దవలసింది" అన్నది కాంతమ్మ.

"అంతమాత్రానికే చిన్నా పెద్దా అన్న మర్యాద కూడా లేకుండా పూర్తిగా మాట్లాడటమే మానేస్తాడటమ్మా? డబ్బివ్వటం లేదని నీతోకూడా మాటలు మానేశాడా, మీ అబ్బాయి?" అన్నాడు రమణయ్య కాస్త కోపంగా.

కాంతమ్మ తెల్లబోయి చూసింది అందరివంకా.

"ఈ పల్లెటూళ్ళల్లో ఒకరింట్లో జరిగే విషయాలన్నీ దాదాపు ఊరందరికీ తెలిసే ఉంటాయి. రహస్యాలు కూడా దాగవు. రోజూ ఈ ఇంట్లో జరుగుతున్న రాద్ధాంతం — అదే . . . అతను డబ్బడగటం, నువ్వు లేదనటం—అంతా మీ పొరుగు వాళ్ళు నేను అడగకుండానే నాతో చెప్పారు. మీ అబ్బాయి వ్యాపారమంటూ చేసి డబ్బంతా తగలేస్తాడేమోనని నీకంత భయంకదా, మరి అందరి డబ్బూ అలాంటిదే కదమ్మా. పైగా వివరంగా నా విషయాలన్నీ చెప్పిన తరవాత కూడా అతడిలా పట్టుపట్టుకు కూర్చుంటాడని అనుకోలేదు" అన్నాడు రమణయ్య.

వీళ్ళ సంభాషణ అంతా అప్పుడే వచ్చి వీధి వసారాలోనే కూర్చున్న కేశవరావు విన్నాడు. అప్పటికీ ఏమీ మాట్లాడలేదు. అతను వింటూనే ఉన్నాడని రమణయ్యకూ తెలుసు.

కేశవరావు పెరట్లోనుండి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రమణయ్య ఇక తనూ ఊరుకుంటే లాభం లేదనుకున్నాడు.

"మేము రాత్రి బండికి వెళుతున్నామోయ్, కేశవరావ్! నా మీద కోపంతో అమ్మాయి నేమీ అనకు" అన్నాడు నెమ్మదిగా.

కామాక్షమ్మ తన మనస్సులో మాటకూడా చెప్పేసింది.

"పల్లెటూళ్ళల్లో ఎప్పుడూ ఉండలేదు. దాని అవసరాలన్నీ నీవే జాగ్రత్తగా చూడాలి, నాయనా" అంటూ పక్కనే కూర్చున్న శ్రీలక్ష్మి జుట్టు నిమురుతూ, "నా తల్లి ఎలా ఉంటుందో ఇక్కడ" అని అన్నది.

ఇంతవరకూ మూగనోము పట్టిన కేశవరావు ఒక్కసారిగా కట్టెగా అరిచాడు.

"అంత భయపడుతున్నవాళ్ళు ఎందుకు తీసుకు వచ్చారు! మీ దగ్గరే ఉంచుకోకపోయారా? ముందు తెలియదా మాది పల్లెటూరి సంబంధమని. పల్లెటూరి వాళ్ళకిచ్చి, పల్లెల్లో కాపురం చేయలేదంటూ ఇప్పుడు విచారిస్తున్నారేం, మహా బాగుంది" అన్నాడు కోపంగా.

అల్లుడు కోపంగా, ఉక్రోషంగా అంటున్న మాటలు రమణయ్యకు విచిత్రంగా తోచాయి. చదువంతా పట్నంలోనే చదివి, అది పూర్తి అవగానే వెంటనే ఉద్యోగంలో చేరి, సెలవుల్లో కూడా స్వంత ఊరు వెళ్ళడాని కిష్టపడని అతను ఇప్పుడిలా మాట్లాడుతున్నాడంటే అది కేవలం తనమీద కోపంవల్లనే. ఇప్పుడంటే ఏదో గాలి మళ్ళి వ్యాపారం చేయాలంటూ వచ్చాడుగాని, నిన్న మొన్నటివరకూ పట్నం విడిచి రాలేనన్నవాడేమరి!

"తెలియకేమయ్యా, బాగానే తెలుసు. కాని అప్పట్లో మీరంతా అప్పుడే విదేశాలనుండి వచ్చిన వాళ్ళలా మాట్లాడారు" అన్నాడు రమణయ్య చిన్నగా నవ్వుతూ.

కామాక్షమ్మ వెంటనే అందుకుంది, "పట్నంలో తిరగటానికి కనీసం మోటారు సైకిలైనా కావాలన్నారు. నువ్వు నూలేట్లు తప్ప పంచెలు, ధోవతులు కట్టననీ, మేము పెళ్ళిలో పెట్టవలసిన బట్టలకు బదులు మరో నూటే ఇవ్వమనీ చెప్పారు మీవాళ్ళు. అవన్నీ జరిపించిన వాళ్ళం గాబట్టి, ఇప్పుడు మీరిలా ఈ పల్లెల్లో వచ్చి ఉంటామంటూంటే. . ."

కామాక్షమ్మ మాటలు పూర్తికాకముందే "నువ్వూరుకో అమ్మా, వారసలే కోపంగా ఉన్నారు" అంటూ అడ్డుపడింది శ్రీలక్ష్మి.

కేశవరావు కోపంతో నిజంగానే పిచ్చివాడయ్యాడు.

"అంత బాధపడుతున్నవాళ్ళు ఇక్కడ ఉండ నవసరం లేదు. మీతోపాటూ మీ అమ్మాయిని కూడా తీసుకొనిపోయి పట్నంలో జాగ్రత్తగా ఉంచండి" అంటూ శ్రీలక్ష్మి ఒడిలో నిద్రపోతున్న పాపను తీసుకుని గదిలోకి వెళ్ళి తలుపులు విసురుగా వేసుకున్నాడు.

అనుకోని ఈ సంఘటనకు అక్కడున్న అందరూ నివ్వెరపోయారు. పాప నిద్రనుండి లేచిపోయిందేమో, ఏడుపు మొదలుపెట్టింది. శ్రీలక్ష్మి గబగబా వెళ్ళి తలుపు తడుతూ పిలిచింది.

కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి. కాని కేశవరావు అడ్డంగా నిలబడి శ్రీలక్ష్మిని లోనికి పోనివ్వలేదు. చేతిలో ఉన్న పెట్టెను బయటకు విసిరివేస్తూ, "వెళ్ళు, నువ్వూ మీవాళ్ళతో వెళ్ళిపో" అని మళ్ళీ తలుపులు మూసేశాడు.

నేలమీద పడ్డ పెట్టె ఆ విసురుకు తెరుచుకుని, అందులో ఉన్న శ్రీలక్ష్మి బట్టలూ, పాప బుల్లిబుల్లి చొక్కాలూ అన్నీ చిందరవందరగా పడ్డాయి.

'తన సంసారంకూడా అలాగే కాబోతూందా. ఏమిటిదంతా...' శ్రీలక్ష్మి దుఃఖం అంచులు దాటిపోయింది.

"ఏమండీ! మిమ్మల్నీ, పాపను విడిచి నే నెక్కడకు వెళతానండీ? ముందు తలుపు తీయండి. పాపకు పాలు పట్టాలి" అంటూ, ఏడుస్తూ తలుపు దగ్గరే నిలబడింది.

ఎంతకీ ఆ తలుపులు తెరవబడలేదు.

రమణయ్యా, కామక్షమ్మా అల్లుణ్ణి బ్రతిమిలాడినా లాభంలేకపోయింది. చివరకు కాంతమ్మ, ఈ గొడవకు అక్కడ చేరిన పెద్దలూ కూడా కేశవరావుకు నచ్చజెప్పబోయారు.

అన్నింటికి కేశవరావు మౌనమే జవాబుగా వచ్చింది గదిలోనుండి. పాపకూడా ఏడ్చి ఏడ్చి అలసి నిద్రలో పడిపోయింది.

శ్రీలక్ష్మి గుండెలు అవిసేలా ఏడుస్తూంది. కామాక్షమ్మకు, రమణయ్యకు కూతుర్ని ఎలా ఓదార్చాలో అర్థం కావటం లేదు.

కాంతమ్మ అనలేక అనలేక అన్నది: "మీరు వెళ్ళి రండి, అన్నయ్యా! మీరున్నంతసేపూ వాడు ఇలాగే మొండిపట్టు పడతాడో ఏమో! మరీ ఇంత మొండితనం చేస్తాడని నేనూ అనుకోలేదు" కొడుకు ప్రవర్తనకు ఆవిడ కూడా బాగా నొచ్చుకుంటున్నది.

"ఏమీ అనుకోకమ్మా, వదినా. నేనెలాగో సర్దుతాముగా, మీరు వెళ్ళిరండి" అన్నది కాంతమ్మ మళ్ళీ.

పెద్దలుకూడా అలాగే చెప్పడంతో, బండికి ఇంకా చాలా టైమున్నప్పటికీ స్టేషనుకి వెళ్ళి అక్కడే కూర్చోవచ్చని బయలుదేరారు కామాక్షమ్మా, రమణయ్యా.

శ్రీలక్ష్మి ఎటూ చెప్పలేక అయోమయంగా చూస్తూండిపోయింది.



విశ్రాంతి

చిత్రం—ఆంజనేయులు (మద్రాసు-4)

వారటు వెళ్ళగానే కేశవరావు గది తలుపులు తెరిచి బయటకువచ్చాడు. శ్రీలక్ష్మికి అతని ముఖం చూడాలంటేనే భయమూ, అసహ్యమూ కూడా కలిగాయి. పరుగున పోయి పాపను గుండెలకు హత్తుకుంటేనేగాని ఆమె గుండె దడ తగ్గలేదు.

ఒక అరగంట పోయిన తరవాత కాంతమ్మ స్టేషనుకు కబురు పంపింది—అంతా సవ్యంగా ఉంది, ఏమీ దిగులుపడవద్దని. కామాక్షమ్మ కంటతడి అప్పటికి కాస్త ఆరింది. రమణమ్మ దీర్ఘంగా నిట్టూర్చాడు. రెండు గంటలు అలా స్టేషనులో పడిగాపులు పడి ఎదురుచూస్తే వాళ్ళు వెళ్ళవలసిన రైలు వచ్చింది.

తిరిగి వచ్చేసినప్పటినుంచీ రమణయ్యా కూతురు దగ్గరనుండి ఉత్తరం వస్తుందని ఎదురుచూచాడు. రాలేదు. తనే రెండు ఉత్తరాలు రాశాడు. నెల కావస్తున్నా శ్రీలక్ష్మి దగ్గరనుండి ఉత్తరం రానేలేదు. రమణయ్య

ధ్యాస రోజంతా ఆమెమీదే ఉండేది. ఏమయిందో, ఎలా ఉంటున్నారో ఒక ఒకటే ఆలోచనలు.

తల్లిదండ్రులకు తమ సంతానంమీద ప్రేమ ఉండడం సహజం. కాని, అది అందరిమీదా సమానంగా ఉంటుందని చెప్పలేం. రమణయ్యకు మొదటినుండీ కూడా శ్రీలక్ష్మి ప్రాణసమానంగా ఉండేది. శ్రీలక్ష్మి కంటే పెద్దవాళ్లిద్దరు కొడుకులున్నారు. శ్రీలక్ష్మి తరవాత ఇద్దరు కూతుళ్లూ, ఒక కొడుకూ ఉన్నారు. వీరందరిమీద ప్రేమ ఉన్నప్పటికీ ఆ ప్రేమ వేరు. ఇంటికి 'పెద్దాడబడుచు' అనేమో, శ్రీలక్ష్మిమీద ఆయనకున్న ప్రేమ వేరు.

అందుకే కామాక్షమ్మ అప్పుడప్పుడూ అంటూండేది. "మీకు మీ పెద్ద కూతురంటేచాలు, మిగతావాళ్ల సంగతేమీ పట్టదు" అని.

"వాళ్లందరికీ నీవున్నావు కాదుటే. శ్రీలక్ష్మి మన ఇంటికి లక్ష్మి!" అనేవాడు రమణయ్య నవ్వుతూ.

ఇన్నాళ్లూ శ్రీలక్ష్మి కాపరంలో ఎలాంటి ఒడిదుడుకులు లేవు. సాఫీగా గడిచిపోతున్నదనే చెప్పవచ్చు. కేశవరావు అలకలు, కోరికలు అన్నీ వెంటవెంటనే తీర్చటం, అదీ — అతను కొత్తల్లుడనే మోజేకాకుండా, శ్రీలక్ష్మి సంతోషంకోసమని కూడా!

దానికీ కామాక్షమ్మ పోట్లాట వేసుకునేది.

"మరీ ఇంత విడ్డూరంగా చేస్తారేమిటండీ. ఇతని కొక్కడికీ ఇవ్వగానే సరా, రేపు మిగతా అల్లుళ్లకుకూడా ఇలాగే జరపాలంటే మనకు సాధ్యమయ్యేపనా? జరపకపోతే వాళ్లూరుకుంటారా? అయినా దేనికైనా మంచి, చెడు అంటూ ఉండాలి" అని విసుక్కునేది.

"మిగతావాళ్ల సంగతి తరవాత చూడవచ్చును లేవే. నా లక్ష్మి సంతోషమే నాకు కావలసింది" అనేవాడు రమణయ్య.

అంత లక్షణంగా అన్నీ సమకూర్చి, ఎంతో ప్రేమాదరణలతో చూచినప్పటికీ, చివరకు ఇప్పుడు ఈ డబ్బు ఇవ్వలేదనే ఒక్క కారణంగా అల్లుడి ప్రవర్తన రమణయ్యకు అనుకోని ఎదురుదెబ్బలా తగిలింది. కనీసం కూతురి ఉత్తరమైనా వస్తే ఆయన కింత విచారముండేదికాదు.

"పోనీలెండి. వాళ్లూ వాళ్లూ సర్దుకుని ఎలాగో ఉంటారు. మనం ఎంతకని కనిపెట్టుకుని ఉండగలం" అన్నది కామాక్షమ్మ.

కామాక్షమ్మకున్నంత ఓపిక రమణయ్యకు లేదు. శ్రీలక్ష్మిని వెంటనే చూడాలి అన్న కోర్కె బయలుదేరింది. అనుకోవడమే తడవుగా ప్రయాణమయ్యాడు.

రమణయ్య వెళ్లేటప్పటికి కేశవరావు ఇంట్లోలేడు. కాంతమ్మ ఎంతో మర్యాదచేసి మాట్లాడింది. కాని శ్రీలక్ష్మి ప్రవర్తనే ఏమిటో కొత్తగా ఉన్నట్లు అనిపించింది రమణయ్యకు. కూతుర్ని, మనుమరాలిని చూచిన సంతోషం మనసంతా నిండినా, శ్రీలక్ష్మి ప్రవర్తన ముల్లులా గుచ్చుకుని బాధపెట్టింది.

శ్రీలక్ష్మి తండ్రిని చూచీచూడగానే సంతోషంతో ఎదురువచ్చింది. పాపను అందించింది. ఉత్సాహంతో ఇంటివద్దని కబుర్లన్నీ అడుగుతున్నదల్లా, చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆలోచనల్లో పడింది. తండ్రి మాట్లాడే మాటలకూ, ఆయన వేస్తున్న ప్రశ్నలకూ గాభరా గాభరాగా జవాబులు చెబుతూ, వీధి గుమ్మంవైపే చూస్తూ కూర్చుంది.

"ఉత్తరం రాయలేదేమమ్మా? ఎలా ఉన్నావోనని మేమంతా ప్రతి రోజూ అనుకోవడమే" అన్నాడు రమణయ్య.

"బాగానే ఉన్నాను, నాన్నా. ఉత్తరం రాయాలంటే . . . ఏదీ, దీని పనులతోనే సరిపోతూంది. క్షణం తీరనివ్వటం లేదు." శ్రీలక్ష్మి గొంతులో ఏదో వణుకు స్ఫురించింది.

"ఎందుకులే తల్లీ, అనవసరంగా పసిదానిమీద పెడతావు నెపం! మీ ఆయన రాయడానికి వీల్లే దన్నాడు కదూ?"

లోక సహజమైన విషయం ఆయనకు మాత్రం తెలియదా మరి. 'అల్లుడుగారు' అనబడే వ్యక్తి— మామగారిమీద శత్రుత్వం వహించడానికి మొదటి గుర్తు — భార్యచేత ఆమె పుట్టింటికి రాసే ఉత్తరాలను మాన్పించడము, అటునుండీ వచ్చేవి ఆమెకు చేరనివ్వకపోవటమూను. తరవాత రాకపోకలు బంద్ చేయడమూ; వాళ్లదగ్గరా, వీళ్లదగ్గరా భార్య పుట్టింటి వారు చేసిన మహాపరాధాలు ( అతని దృష్టిలో ) చాటి చెప్పటమూ జరుగుతూ ఉండేవే.

"అబ్బె. అదేంలేదు నాన్నా. మీ దగ్గరనుండి ఉత్తరాలేం రాలేదు. మీరే వస్తారేమోలే అని నేను రాయలేదు."

"అయితే నేను రాసినవి నీకు అందనివ్వలేదన్నమాట. ఇది నేను అనుకున్నదేలే. సరేగాని ఏమయింది మీ వ్యాపారం సంగతి?" అని అడిగాడు రమణయ్య.

"అదీ ఇంకా తేలలేదు. ఎక్కడా కూడటం లేదట. సెలవుకూడా అయిపోవస్తున్నది. కుదరకపోతే తిరిగి ఉద్యోగానికి వెళ్లిపొమ్మనే అత్తయ్యా, అందరూ చెబుతున్నారు. వెళ్లకపోతే ఇక్కడెలా జరుగుతుంది? వచ్చేనెలలో వెళ్లిపోతామేమో" అన్నది శ్రీలక్ష్మి.

"ఏదయినా మన మంచికే నమ్మా. నమ్మకంలేని వ్యాపారం మీద ఆధారపడేదానికంటే నిక్షేపమంటి ఉద్యోగమే నయం."

ఏది జరిగినా మన మంచికే నని అంటున్న తండ్రి మాటలకు, నెమ్మదిగా బరువుగా నిట్టూర్చింది శ్రీలక్ష్మి. ఈ జరిగినదానికి చివరకు ప్రతిఫలంగా తేలింది — మామా అల్లుళ్ల మధ్య శత్రుత్వం! ఈ సంగతి తెలిస్తే నాన్న ఇలా ఆనగలిగి ఉండేవారు కాదు. అల్లుడు ఇంకా తనంటే మండిపడుతున్నాడని తెలిస్తే మరో క్షణం ఇక్కడ నిలకడగా కూర్చోగలరా? కానీ ఎలా చెప్పడం? ఆయన వచ్చే వేళ కూడా అయింది. రాగానే మామగారిని చూచి ఏం గొడవ చేస్తారో ఏమో! ఇంతవరకూ తనను ఇంటికి ఉత్తరం రాయకుండా కట్టడిచేశారు. అక్కడికి ఇకమీదట వెళ్లేదికూడా లేదని ఖండితంగా చెప్పారు. ఇప్పుడు వాళ్లతో మాట్లాడరాదని అన్నా తనేమీ ఆశ్చర్యపడదు. ఈ రెండు నెలలలోను అతనిలో వచ్చిన మార్పులకు ఏం జరిగినా జరగవచ్చుననిపిస్తూంది. అతను అనుకున్న పనులు ఏవీ నెరవేరక, అన్నిటికీ చిరాకుపడుతున్నాడు.

శ్రీలక్ష్మి ఆలోచనలనుండి ఉలిక్కిపడి చూసింది. కేశవరావు రానే వచ్చాడు. వస్తూనే మామగారిని చూశాడు. అతని కళ్లు కోపంతో ఎరుపెక్కాయి.

"అమ్మాయి ఏమేమి కష్టాలుపడుతూందో చూడటానికి వచ్చారా? లేక తీసికెళ్లడానికి వచ్చారా?" అన్నాడు కేశవరావు.

రమణయ్య వెంటనే ఏమీ అనలేదు. అసలు అప్పుడు అతనితో మాట్లాడకపోవటమే మంచిదని అనిపించింది. ఆయనకు పరిస్థితులన్నీ అర్థమయ్యాయి.

కేశవరావు తన వాదాన్ని పెంచే అవకాశం లేకపోవడంతో ఇంట్లోకి వెళ్లిపోయాడు.

ఆపూట అక్కడే భోజనంచేసి, కాసేపు మనవరాలితో ఆడుకుని ప్రయాణమయ్యాడు రమణయ్య.

"పట్నం వెళ్లేముందు నాలుగు రోజులు మన ఇంట్లో ఉండివెళ్లేలా చూడు తల్లీ. మీ అమ్మ పాపను చూడాలంటూంది" అన్నాడు, రమణయ్య పాపను శ్రీలక్ష్మికి అందిస్తూ.

## గాంధీజీ సూక్తులు



### బాధ్యులెవరు?

మనిషి తన యాతనలకు, తన ఆనందానికి తానే బాధ్యుడని అనుభవం గడించినకొద్దీ నాకు విస్పష్టంగా బోధపడుతున్నది.

ఇటువంటి పరిస్థితులలో మనిషికి సుఖదుఃఖాలెందుకు కలుగుతున్నాయి?

అసలు సంగతి ఏమిటంటే మనిషి ఇటువంటి విషయాలను గురించి ఆలోచించవే ఆలోచించడు. ఇటువంటి ఆలోచనల కెక్కడ తీరికే లేదనుకుంటాడు.

* ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం *

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

సేదతీర్చుకోండి!



ఎపెప్* గల
అవేదన్®
తలనొప్పిని త్వరగా
పోగొట్టుతుంది
—అది నిరపాయమైనది కూడ!

అవేదన్ వేసుకొని నిమిషాల్లో
ఉపశమనము పొందండి! అది తలనొప్పి,
జలుబు, ఫ్లూ, పంటినొప్పి, నడుమునొప్పి
మరియు యితర మామూలు నొప్పులకు
ఉపశమనము కలిగిస్తుంది. ఆశ్చర్య
కరమైన ఎపెపగల అవేదన్
నిరపాయమైనది కూడ.




SQUIBB®
సారాభాయ్ కెమికల్స్

Shilpi SC 6 8/69 Tel

అప్పటిదాకా ఎంతో బలవంతంగా ఆపుకున్న ఏడుపును ఇక ఆపుకోను సాధ్యంకాలేదు. "నాన్నా..." అంటూనే బావురుమని ఏడ్చింది శ్రీలక్ష్మి.

"ఆ ఆశలేవీ పెట్టుకోకండి నాన్నా, అక్కడకు రావడానికి వీల్లేదట. నేను రాలేను."

రమణయ్య హతాశుడై పోయాడు. తను వింటున్నదీ, శ్రీలక్ష్మి చెబుతున్నదీ నిజమని నమ్మలేక పోయాడు.

"అంటే . . . ఇక మన ఇంటికి రానే రావా!" అని అడిగాడు ఆశ్చర్యంగా.

శ్రీలక్ష్మి ఎక్కిళ్లను ఆపుకోడానికి ఎంతో ప్రయత్నంచేసింది. 'వాళ్లకూ, నాకూ ఇక ఏ సంబంధమూ లేదు. నీకు మీవాళ్లే కావాలో, నేనే కావాలో నిశ్చయించుకుని ఇక్కడ ఉండు. అంతేగానీ రాకపోకలు కుదరవు' అన్న కేశవరావు మాటలు ఆమె చెవుల్లో మారుమ్రోగుతూ ఉన్నాయి.

"వారు రారట. నేను వచ్చినా మళ్లీ ఇక్కడకు రావడానికి వీల్లేదట" అన్నది శ్రీలక్ష్మి.

పిచ్చిగా శ్రీలక్ష్మినే చూస్తున్నవాడల్లా, ఏదో నిశ్చయం చేసుకున్నవాడల్లే లేచి నిలబడ్డాడు రమణయ్య.

"సరేనమ్మా. అతనిష్టంలేకుండా నీవుమాత్రం ఎప్పుడూ అక్కడకు రాకు. వస్తే ఇద్దరూ కలిసి రండి. ఒంటరిగా రాకు. పండంటి సంసారాన్ని కాలదన్నుకోకమ్మా. నీవెక్కడ ఉన్నా సుఖంగా ఉండటమే మాకు కావలిసింది. వెళ్లివస్తాను మరి..." అంటూ గొంతు పూడుకుపోగా మరి మాట్లాడలేక, నెమ్మదిగా బయటకు వెళ్లిపోయాడు.

ఇంటికి వచ్చి, జరిగిన సంగతంతా విపులంగా భార్యకు చెప్పాడు.

"అతని సంగతి తెలిసికూడా మనం బాధపడి లాభం లేదు. కొన్నాళ్లుపోతే అతనే మారవచ్చు" అన్నది కామాక్షమ్మ. తను ధైర్యంగా ఉండటమేకాకుండా భర్తకు ధైర్యం చెప్పటం కూడా ఎప్పుడూ ఆమె వంతే!

కేశవరావు తిరిగీ ఉద్యోగంలో చేరాడు.

పట్నం వెళ్లిన తరవాతనైనా వీలుచూచుకొని శ్రీలక్ష్మి ఉత్తరం రాస్తుందని ఎంతో ఎదురుచూశాడు రమణయ్య. ఆయన పిచ్చిగానీ, ఈనాటి స్త్రీ అన్నిటా సమాన హక్కులు సాధించి ముందుకు పోతున్నా, ఉన్నచోటునుండీ ఒక్క అడుగైనా ముందుకు వేయలేని వారుకూడా ఎందరో ఉన్నారు. వీళ్లు తమ భర్త సినిమాకు తీసికువెళ్లలేదని అలిగి, మూతి ముడుచుకుని — వంటింట్లో కూర్చోగలరేకానీ స్వతంత్రించి ఆ సినిమాకు ఒంటరిగా వెళ్లి చూచిరాలేరు. అలాటిదే శ్రీలక్ష్మి. భర్త ఆజ్ఞమీరి ఆపని ఎలా చేయగలదు? చేసి భర్తను ఒప్పించగల నేర్పు, చనువూ ఆమెకు లేవు.

మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి. తనే వెళ్లి శ్రీలక్ష్మిని చూచిరావాలని మనసులో ఎంత కోర్కెగా ఉన్నా పనుల ఒత్తిడివల్ల వెళ్లటం పడలేదు రమణయ్యకు. రెండో అమ్మాయికి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. వాటిలో ఏదో ఒకటి స్థిరపరచుకుని వెంటనే చేసేయాలనే ఉంది. ఆ హడావిడిలో ఉండి శ్రీలక్ష్మిమీద ధ్యాస కాస్త మరల్చుకోగలిగాడు.

అనుకున్నట్లుగా మంచి సంబంధం కుదిరి, లగ్నాలు కూడా పెట్టేసుకున్నారు. ముఖ్యమైన బంధువులకు

ఉత్తరాలు రాస్తూ అల్లుడికి కూడా రాశాడు రమణయ్య, పిలయినంత ముందుగా రావలిసిందని.

పెళ్లి పనులన్నీ చురుకుగా జరుగుతున్నాయి.

శ్రీలక్ష్మి ఇవాళ వస్తుంది, రేపు వస్తుంది అని ఎదురుచూడటం, నిరాశ పడటమే అవుతూంది. శ్రీలక్ష్మి లేని లోటు ఇంట్లో ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నారు.

పెళ్లిపనుల్లో సతమతమవుతూ, "లక్ష్మి ఉంటే ఇవన్నీ చూచుకునేది" అని కామాక్షమ్మ ఎన్నోసార్లు అనుకుంది.

అసలు శ్రీలక్ష్మి లేకపోవడంతో ఇంటికి పెళ్లికళ రానేలేదనేవాడు రమణయ్య. ఇంక పిల్లలంతా అక్కా, బావలకోసం, రాబోయే పెళ్లికొడుకుకోసం కంటే కూడా ఎక్కువగా ఎదురుచూస్తున్నారు.

పెళ్లి వారం రోజుల్లోకి వచ్చేసినా శ్రీలక్ష్మి కాదుకాని, కనీసం వాళ్ల దగ్గరనుండి ఉత్తరంకానీ లేదు.

ఎదురుచూచి లాభంలేదని రమణయ్య బయలు దేరాడు. కాని కామాక్షమ్మ ఆయన్ని వెళ్లనివ్వలేదు.

"ఇక్కడ ఇన్ని పనులుపెట్టుకుని మీరు వెళతా నంటా రేమిటండీ? పెద్దబ్బాయిని పంపండి" అంటూ అడ్డుపడింది.

సరే. ఎవరైతే నేం? అని పెద్దవాడిని పంపారు.

శ్రీనివాసరావు వెళ్లేటప్పటికి కేశవరావు ఊళ్లోనే లేడు. రెండు రోజుల కిందట వాళ్ల స్వగ్రామం వెళ్లాడట. ఎప్పుడు వచ్చేదీ సరిగా చెప్పలేదట. అతని కోసం రెండు రోజులు అక్కడే ఉన్నాడు శ్రీనివాసరావు.

"నువ్వెళ్లరా, అన్నయ్యా! అక్కడ పనులన్నీ వదులుకుని ఇక్కడ కూర్చుంటే ఎలా? వారు రాగానే, ఇద్దరం కలిసి వస్తాంలే..." అన్నది శ్రీలక్ష్మి. అన్నయ్య తను చెప్పిన మాటలు నమ్మి వెళ్లిపోగానే, శ్రీలక్ష్మి గుండెలు చెరువయ్యేలా కుమిలి కుమిలి ఏడ్చింది. అంతకంటే చేయగలిగిందేముంది? ఆమెకు తెలుసు, కేశవరావు ఊరెందుకు వెళ్లిందీ, తిరిగి ఎప్పుడువచ్చేదీ. పెళ్లి అయిన మరునాటికి గానీ అతను తిరిగిరాడు!

పెళ్లిరోజు కూడా రమణయ్య ఆశ వీడలేదు. గంట గంటకీ మనుష్యుల్ని స్టేషనుకీ, బస్ స్టాండుకీ పంపుతున్నాడు.

ఇదంతా చూచిన శ్రీనివాసరావుకు బాగా కోపం వచ్చింది.

"ఏమిటి, నాన్నా! మీరు మరీను. ఆ వచ్చేవాళ్లు స్టేషనుదాకా వచ్చి ఆగిపోతారా ఏం? వస్తే వస్తారు, లేకపోతే లేదు. అంతా ఇలా స్టేషనుచుట్టూ తిరుగుతూంటే ఇక్కడ పనులెవరు చేస్తారు" అని విసుక్కున్నాడు.

"అదేమిటిరా, అమ్మాయిరాకుండా పెళ్లేలారా..." అయోమయంగా అడుగుతున్న తండ్రి మాటలకు జాలివేసినా, కోపంకూడా వచ్చింది శ్రీనివాసరావుకు.

"వాళ్లు రాలేదని పెళ్లి వాయిదా వేస్తారా? పోనీ అదయినా చెప్పండి" అన్నాడు విసుగ్గా.

ఆమాటలకు చిన్నబుచ్చుకున్నా, కొడుకువంక కోపంగా చూచాడు రమణయ్య.

పెళ్లిలో అందరికీ ఇదొక చర్చా విషయంగా మారింది.

శ్రీలక్ష్మి ఏదంటే ఏదని అంతా అడిగేవాళ్లే. "పెద్దమ్మాయి, అల్లుడు రాలేదు, ఎందుకని రాలేదో" అని మరికొందరు ఆరాలు తీయడం మొదలుపెట్టారు. జరిగినదానికి చిలవలు పలవలుచేర్చి కథలుగా చెప్పుకుంటున్నారు.

అందరికీ అన్ని సమాధానాలు చెప్పేటప్పటికి తల ప్రాణం తోకకు వచ్చినట్లుగా ఉంది రమణయ్యకు, కామాక్షమ్మకు. అసలే వాళ్లు రాలేదన్న బాధ కొంతైతే ఈ వచ్చిన బంధువులతో మరింత బాధ అయింది. తను స్వయంగా తప్పు చేయకపోయినా, వాళ్లు రాక పోవడానికి తనే కారణమన్నట్లు చూస్తున్న వాళ్ల చూపులకు తట్టుకోలేకపోయాడు రమణయ్య.

*నలుగురిలో తననింత అవమానాల పాలు చేయడానికి* తను చేసిన అపరాధమేమిటి? ఆడబిడ్డ ఇవ్వనందుకు ఇంత పగ సాధిస్తున్నాడా! ఇంతేనా బంధుత్వాల, మమకారాల విలువ? వీటికంటే కూడా డబ్బే ప్రధానంగా భావించి ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడా! 'ఛీ మూర్ఖులతో నా కేమిటి' అని గుండె ఎంత నిబ్బరం చేసుకోవాలనుకున్నా వీల్లేకపోతూంది. ప్రాణసమానంగా చూచుకునే శ్రీలక్ష్మి లేకుండానే తనింట్లో మరో శుభకార్యం జరిగిపోతూంటే ఆయన మనసంతా ఎవరో చెయ్యిపెట్టి కలచినట్లే అయింది. ఆ బాధ వివరించడానికి మాటలకు అందనిది.

పేచీలేమీ లేకుండా పెళ్లి సవ్యంగా జరిగింది. అయినా రమణయ్య కుటుంబంలో ఎవరికీ తృప్తిగా లేదు.

మిగతా అందరూ కొద్ది రోజులకైనా ఈ సంఘటన నుండి కోలుకోగలిగారు కాని, రమణయ్యకు ఇది తీరని పరాభవంగా మిగిలిపోయింది. రోజు రోజుకు ఈ ఆలోచనలే ఆయన్ని కుంగదీస్తున్నాయి.

'ఇక ఇంతేనా? శ్రీలక్ష్మిని... నా లక్ష్మిని చూడటానికే నడదా?' అని అనుకుంటూ బాధపడేవాడు.

ఇంత జరిగిన తరవాత తనైనా ఏ ముఖం పెట్టుకుని వాళ్లింటికి వెళతాడు? వెళ్లినా ఎటువంటి మర్యాదలు జరుగుతాయో తెలుస్తూనే ఉంది.

మనోవ్యాధికి మందు లేదంటారు. చివరకు ఈ మనోవ్యాధి రమణయ్యను మంచమెక్కేలా చేసింది. కామాక్షమ్మ మాటలుగానీ, మిగతా పిల్లలంతా కళ్ల ఎదుట ఉన్నాగానీ అతనికేమీ సంతోషం లేదు. మనసంతా శ్రీలక్ష్మితో నిండిపోయింది.

కామాక్షమ్మ శ్రీనివాసరావుచేత అల్లుడికి ఉత్తరాలు రాయించింది, పరిస్థితులన్నీ వివరిస్తూ. ఓసారి వెళ్లి మాట్లాడి రారా అంటే తల్లిమీద మండిపడ్డాడు శ్రీనివాసరావు. అతనికిప్పుడు బావ అంటే గొంతు వరకూ కోపంగా ఉంది. ఆ ఉత్తరాలైనా ఆవిడ మరీ మరీ పోరుపెడితే కాదనలేక రాశాడు.

ఒకటి కాదు, రెండు కాదు, మూడు ఉత్తరాలకైనా అటునుండి ఏమీ సమాధానంలేదు.

రమణయ్య పరిస్థితి రోజురోజుకు విషమంగా పరిణమిస్తూంది. మందులేమీ పనిచేయడం లేదు. ఇంట్లో అంతా గాభరా పడుతున్నారు. వచ్చేపోయే బంధువుల పలకరింపులు, ఓదార్పులతో అంతా గందరగోళంగా ఉంది.

శ్రీనివాసరావు చివరిసారిగా, బావగారిపేర టెలిగ్రాం పంపాడు. 'నాన్నకు సీరియస్‌గా ఉంది, వెంటనే రావలిసిం'దని.

మరునాడు సాయంత్రం దీపాలుపెట్టేవేళ, ఒక రిక్షా వచ్చి ఇంటి ముందు ఆగింది. రిక్షా దిగి లోపలకు వస్తున్న కేశవరావును చూచి అంతా నోళ్లు వెళ్లబెట్టి చూడటం తప్పించి, పలకరించాలని కూడా ఎవరికీ తోచలేదు.

తిన్నగా గదిలోకి వెళ్లి మామగారిని చూచాడు కేశవరావు. ఎవరో కుర్చీ చూపిస్తే మంచం దగ్గరగా కూర్చున్నాడు.

"ఏమయింది? ఏమిటి జబ్బు?" అని అడిగాడు మామూలుగా.

ఇంతవరకూ ఓపికగా అంతా చూస్తున్న శ్రీనివాసరావు కోపం ఆపుకోలేకపోయాడు.

"ఏం బావా, జబ్బు నిజమో కాదో చూడ్డానికి వచ్చావా? మా ఉత్తరాలు, టెలిగ్రాం చూస్తే నమ్మకం రాలేదా? అమ్మాయిని రప్పించుకోడానికి ఇదొక నాటక మేమోనని స్వయంగా చూడటానికి వచ్చావు కదూ? బావా! నీకు పుణ్యముంటుంది. వెంటనే వెళ్లిపో. నాన్న కళ్లు తెరిచి నిన్ను చూస్తే, శ్రీలక్ష్మి రానేలేదని తెలిస్తే ఆయన గుండె ఈక్షణంలోనే ఆగిపోతుంది. నువ్వు చేసిన పనికి ఆయన కుంగి పోని క్షణంలేదు. శ్రీలక్ష్మిమీద బెంగతోనే ఈ స్థితికి వచ్చారు. అది లేకుండా నీవు వచ్చి, ఆయన చావును కళ్లారా చూడా లనుకుంటున్నావా! వెళ్లిపో బావా! త్వరగా వెళ్లిపో" అంటూ దుఃఖం ఆపుకోలేక అవతలకు వెళ్లిపోయాడు శ్రీనివాసరావు.

కేశవరావు వంచిన తల ఎత్తలేకపోయాడు. తనెంత మూర్ఖంగా ప్రవర్తించిందీ, దాని పర్యవసానం ఎలా పరిణమించిందీ కళ్లారా చూస్తూ ఎక్కువసేపు అక్కడ కూర్చోలేకపోయాడు. కామాక్షమ్మ ఏడుపు గొంతుతో... దాదాపు ఏడుస్తూనే ఏదో చెప్పబోతూంటే అది వినలేక పోయాడు. ఎవరో తరుముతూన్నట్లుగా లేచి బయటకు వెళ్లిపోయాడు.

అతను వచ్చి వెళ్లినట్లు నాన్నకు ఏమాత్రం తెలియనీయ వద్దని ఇంట్లో అందరికీ మరీ మరీ చెప్పుతుంటాడు శ్రీనివాసరావు.

డాక్టరు వచ్చి చూచి ఫరవాలేదు అని ధైర్యం చెప్పినా, ఎవరికీ ఆ ధైర్యం నిలవటంలేదు. మూసిన కన్ను తెరువకుండా పడుకుని ఉన్నాడు రమ

విజ్ఞానం

విజ్ఞానం లక్ష్యం సత్ప్రవర్తనమే.

—సర్ పి. సిడ్నీ

దుఃఖం

రాత్రి నక్షత్రాలను వెలువరించినట్టు, దుఃఖం మన కెన్నో సత్యాలను సాక్షాత్కరింపజేస్తుంది.

—జి. బెయిలీ

చలనచిత్ర రంగంలో
పేరెన్నికగన్న పత్రిక
స్క్రీన్

తెల్ల వెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేశరంజన్' ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్లవెంట్రుకలను సరిగాపార్చును. మొదట తెల్లవానిని నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి కంటిచూపును వృద్ధిపరచును. లాభంపొందిన వారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభంలేకున్న డబ్బువాపసు. ధర రు. 10/-.
**Bharat Treatment Centre (R)**
**P.O. Katri Sarai (Gaya)**

వాయిదాలపై ఉంద ట్రాన్సిస్టర్!

హవా
(గ్యారంటీతో)
నెలసరి రు. 5/—ల
చెల్లుబడిమీద 3 బాండ్ అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్. ప్రతి పల్లెకు, పట్టణానికి పంపవచ్చును. వ్రాయండి:
**HAVA SALES (48)**
**Shakti Nagar, Delhi-7.**

జాస్యే. ఆ పరిస్థితిలో ఏంచెయ్యాలో ఎవరికీ తోచటం లేదు.

రెండోనాడు తెలతెలవారుతుండగా ఆ ఇంట్లో చాలా రోజులకు మళ్ళీ అడుగుపెట్టింది శ్రీలక్ష్మి! ఆమె రాకతో సూర్యోదయం కాకముందే ఇల్లంతా వెలుగుతో నిండిపోయినట్లనిపించింది.

శ్రీలక్ష్మి ముఖంలో మునుపటి కళలేదు. దారిలో అంతా ఏడుస్తూనే వచ్చినట్లుంది. ఆమె వెనకాల పాప నెత్తుకుని కేశవరావు, తలవంచుకుని, తప్పుచేసిన వాడిలా నడిచివచ్చాడు.

తండ్రిని చూస్తూనే నిశ్చేష్టిత అయింది శ్రీలక్ష్మి. తనకోసం, కేవలం తనమీద బెంగతోనే ఇలా అయిపోయిన కన్నతండ్రి ప్రేమ దేనితో కొలవగలదు? ఆ ప్రేమకు తానేమివ్వగలిగింది?

శ్రీనివాసరావు చెల్లెలినిగానీ, బావనుగానీ పలకరించ లేదు. ఎవరితోటో అంటున్నట్లుగా అన్నాడు. "పిల్లల్ని కని కూడా కన్నప్రేమను అర్థంచేసుకోలేని మూర్ఖులు. వాళ్ళకూ ఉందిగా ఓ ముద్దుల కూతురు. అది పెరిగి, పెద్దదయి అత్తవారింటికి వెళ్ళినప్పుడు గాని ఆ ప్రేమ ఏమిటో వాళ్ళకు తెలిసిరాదు."

దుఃఖం కట్టలు తెంచుకువస్తుంటే ఆపుకోడానికి కూడా ప్రయత్నించలేదు శ్రీలక్ష్మి. "నిజమే! తా నేనాడూ కన్నతండ్రి ప్రేమను అర్థంచేసుకోలేదా? ఆయనకు తనెంత ప్రాణసమానమయినదీ తెలిసికూడా ...మరి, ఇన్నాళ్ళ దూరంగా ఎలా ఉండగలిగింది? కట్టుకున్న భర్తమాట మీరకూడదని, చివరకు తండ్రిని వదులుకోడానికి కూడా సిద్ధమయింది. పాపను ఒక్క అరగంట చూడటానికి వీలులేకపోతే తన ప్రాణం ఎంత కొట్టుకుపోయేదీ అనుభవమే అయినా, తండ్రి తనను చూడక బాధపడతాడని తెలిసికూడా ఏమీ పట్టనట్లే ఊరుకుంది...' ఎవరెన్ని విధాలా చెప్పినా తండ్రి కన్నుతెరచి తనను చూస్తేనే గానీ పచ్చి మంచినీళ్ళయినా తాగనని, ఆ మంచం ప్రక్కనే కూర్చుండి పోయింది శ్రీలక్ష్మి.

శ్రీనివాసరావు మూర్ఖుడని ఎవరిని అన్నాడో అతని కిప్పుడు కోపంరాలేదు.

"చచ్చిన పామును ఇంకా చంపుతావెందుకులే బావా" అంటూ నెమ్మదిగా వరండాలోకి వెళ్ళి కూర్చున్నాడు కేశవరావు.

**తప్పిదం**

గొప్ప తప్పిదా లెన్నో చెయ్యకుండా ఏ వ్యక్తి గొప్పవాడు గాని, సజ్జనుడు గాని కాలేదు.

—గ్లాడ్‌స్టన్

అంతా రమణయ్య మంచంచుట్టూ చేరారు. క్షణం ఒక యుగంగా గడుస్తూంది.

అందరి ఆశా ఫలించింది. రమణయ్య మెల్లిగా కళ్ళు తెరిచాడు. పండ్లరసం పట్టుకుని నిల్చున్న కామాక్షమ్మ ఆయన్ని లేపి ఇవ్వబోయింది.

లేస్తూనే శ్రీలక్ష్మిని చూశాడు రమణయ్య.

ఆయన కళ్ళు వింతకాంతితో మెరిశాయి. పాలిపోయిన ముఖంలో చిరునవ్వు కనిపించీ, కనిపించక మాయమయ్యింది.

"అమ్మా! లక్ష్మీ, లక్ష్మీ... వచ్చావా ..." అంటూ ఆత్రంగా చేతులు చాపాడు.

"నాన్నా..." అంటూ శ్రీలక్ష్మి ఆయన చేతుల్లో ముఖందాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

"ఛ! తప్పమ్మా, ఏడవకు. ఏమయిందని. నాకేం బాగానే ఉన్నానుగా" అంటూ శ్రీలక్ష్మి చుట్టూ చేతులువేసి, కౌగలించుకున్నాడు. అంత జబ్బుమనిషికీ, ఒక్కక్షణంలోనే ఎంతో బలం వచ్చేసినట్లుగా ఉంది.

మిగతా అందరి గుండెల్లోనుంచీ ఏదో బరువు దిగిపోయింది.

"అబ్బాయి వచ్చాడా? ఏడీ ... రాలేదా? మళ్ళీ ఒక్క దానివే వచ్చావా?" వెంటవెంటనే అడిగాడు రమణయ్య. అతని గొంతులో అనుమానం స్పష్టంగా వినిపించింది.

శ్రీలక్ష్మికి గుండెలు పిండినట్లయింది. ఆ ప్రశ్నలతో. 'వస్తే ఇద్దరూ కలిసి రండి' అని అనాడు ఆయనన్న మాటలు గుర్తుంచుకున్నారన్నమాట! ఆ మాటమీద నిలబడే తానిన్నాళ్ళు తండ్రిని దూరం చేసుకుంది.

"వచ్చాను, మామయ్యా! నేనూ వచ్చాను" అన్నాడు కేశవరావు వరండాలోనుండి వస్తూ. పాప అతనిలోనే ఉంది.

రమణయ్య తృప్తిగా అతనివంక చూశాడు. మనవరాలు తన పక్కనే కూర్చుని ముద్దు ముద్దు మాటలు పలుకుతూంటే మనసారా నవ్వాడు.

ఇంతలో డాక్టరుగారు వచ్చారు హడావిడిగా.

"ఇంక మీ మందులేమీ అవసరంలేదండీ డాక్టరుగారూ, మా లక్ష్మి వచ్చేసింది. అదే ఆయనకు మందు" అన్నాడు శ్రీనివాసరావు నవ్వుతూ.

ఆ కుటుంబ వ్యవహారాలన్నీ తెలిసిన వాడవటంవల్ల డాక్టరు కూడా పెద్దగా నవ్వాడు.

"బావయ్యా, ఇటువంటి కేసులే మా డాక్టర్లని ఎందుకూ పనికిరానివాళ్ళనుగా నిర్ణయిస్తున్నాయి. మా వైద్యానికి ఎంతకీ లొంగని జబ్బులు — ఏ అదృశ్య శక్తికో ఇట్టే లొంగిపోతాయి" అని అన్నాడు.

ఆ అదృశ్యశక్తికి అందరూ మౌనంగా మనసులోనే జోహార్లు అర్పించారు. ★

మన ఆనందమునకు పరమావధి పూర్ణారోగ్యము. నిరోగమయిన శరీరము ఆనంద నిలయము. వ్యాధిని ప్రేరేపించు శక్తులు అనంతము - వాటితో పోరాడి గెల్చుటకు
అంబేశ్వర ఆయుర్వేద ఫార్మశీ (రిజిష్టర్డు)
హెడ్డాఫీసు: మారుటేరు, ప. గో. జిల్లా, (ఆం. ప్ర.)
వారి మందులు పూర్తిగా ఆధారపడదగినవి. వెంటనే వ్రాసి సుఖింపుడు.
బ్రాంచి ఆఫీసు: విజయవాడ బీసెంట్‌రోడ్, LIC ఆఫీసు ఎదురుగా.